క్లుప్తంగా

మారని బతుకులు



మాట్లాడుతున్న శంకర్

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వాలు మారుతున్నా.. దళితుల అభివృద్ధి మారడం లేదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. శనివారం బీ.కొండాపూర్ గ్రామంలో సామాజిక పరివర్తన కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ... దళితులకు ఉపయోగకరమైన మ్యానిఫెస్టోలు లేకపోవడంతో దళితులు పేదలుగా మిగిలిపోతున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, దళిత అభివృద్ధి పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజీవ్, డాక్టర్ కుమార్, వేణు, వెంకటేశ్, శ్యామ్, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలకు మండపాల ముస్తాబు



రంగంపేటలో విద్యుత్ దీపాలంకరణలో మండపం

కొల్చారం(నర్సాపూర్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు మండల వ్యాప్తంగా మండపాలను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణలతో మంట పాలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలతో గ్రామాల్లో పూర్తి పండగ వాతావరణం అప్పుడే మొదలైంది. ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజు అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీలు సన్నద్ధమయ్యాయి.

కొనసాగుతున్న క్రీడా పోటీలు



విజేతలకు మెడల్స్ అందిస్తున్న కోఆర్డినేటర్, పీడీ, ఉపాధ్యాయులు

నర్సాపూర్: పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల, కాలేజీలో శుక్రవారం ప్రారంభమైన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని గిరిజన గురుకులాల మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడో జోనల్ స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రెండో రోజు పలు రకాల పోటీలు చేపట్టామని చెప్పారు. ఆయా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు వ్యక్తిగత మెడల్స్, బృందాలకు మెడల్స్ అందజేస్తున్నామన్నారు. క్రీడా పోటీల్లో ఆయా పాఠశాలలు, కాలేజీలకు చెందిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు, స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ ఇన్‌చార్జి పీడీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది టికెట్లు అమ్ముకునే సంస్కృతి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాపన్నపేట(మెదక్): ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్ పార్టీ సొంతమని బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు శ్రీనాథ్‌రావు, దాసయ్య, ఎంపీటీసీ జ్యోతి సాయిలు ఆరోపించారు. శనివారం వారు యూసుఫ్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రెండున్నర దశాబ్దాలుగా మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తే, చివరి సమయాన ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా, డబ్బులు ఇచ్చిన వారికి అమ్ముకుందని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్‌లోని బడా నాయకులు పార్టీ వీడి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. సమావేశంలో ఏడుపాయల డైరెక్టర్ శ్రీనివాస్ రావు, పార్టీ అధ్యక్షుడు శేఖర్, ఏఎంసీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఉమామహేశ్వర్ రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

మది నిండుగా.. పూల పండగ

జిల్లా వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం సంప్రదాయ దుస్తులు ధరించి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, చెరువుల వద్దకు చేరారు. కోలాటాలు, పాటలతో బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



నర్సాపూర్ రూరల్: పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చేగుంట హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వెల్దుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



శివ్వంపేటలో కోదండరామస్వామి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): అంతారంలో..



హవేళఘనాపూర్‌లో..

ఆలయంలో ప్రత్యేక పూజలు



నర్సాపూర్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొడిపల్లి(నర్సాపూర్): ఆలయంలో శనేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బస్టాండ్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహాలయ అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సంజీవ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న, సదాశివపల్లి, కొడిపల్లి గ్రామాల్లో శనివారం శని అమావాస్య సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వెల్మకన్నలోని శనేశ్వరాలయంలో ఆలయ అర్చకుడు ఉమాశంకరశర్మ, సదాశివపల్లిలో గ్రామ పురోహితులు మెట్టు రాములుశర్మ, కొడిపల్లిలో రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో శనేశ్వరునికి తైలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సదాశివపల్లిలో 41 రోజులుగా శనేశ్వరాలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాండ్ర శోభ నర్సింగారావు దంపతులతో పాటు గ్రామస్తులు సామూహిక పూజలు నిర్వహించారు.

ఆహ్వానం

పెద్దశంకరంపేట(మెదక్): నేటి నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెద్దశంకరంపేటలోని భవానీ మందిరంతో పాటు గడికోట, ఆర్యవైశ్యసంఘం, రామోజిపల్లి, చీలాపల్లి, బుజ్రాన్‌పల్లి, ఉత్తులూర్‌తో పాటు పేటలోని ఆయా కాలనీల్లో అమ్మవారి మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. రామోజీపల్లి దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటప నిర్వాహకులు శనివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళి, కోణం అంజయ్య, నిర్వాహకులు రమేశ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న నిర్వాహకులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

నర్సాపూర్: కార్యకర్తలు, నాయకులందరూ సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ కోరారు. మండలంలోని ఎర్రకుంట తండాలో శక్తి కేంద్రం పనితీరును పరిశీలించి పార్టీ కార్యకర్తలు నాయకులతో మాట్లాడారు. పార్టీ బూత్ అధ్యక్షుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు. ఇదిలా ఉండగా మండలంలోని అన్ని శక్తి కేంద్రాల్లో పనితీరును పది రోజులుగా పర్యటించి పరిశీలించానని రమేశ్‌గౌడ్ చెప్పారు. మండలంలో 37 బూత్‌లు ఉన్నాయని, పది శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు ఉన్నారని చెప్పారు. మండలంలోని బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎర్రకుంట తండా కార్యక్రమంలో పార్టీ నాయకులు మధునాయక్, గోపినాయక్, నగేశ్, నగేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలను కొనసాగించాలి



పెద్దశంకరంపేటలో శోభాయాత్ర



పాపన్నపేటలో జాగరణ యాత్ర

పెద్దశంకరంపేట(మెదక్): ఛత్రపతి శివాజీ ఆశయాలను యువత కొనసాగించాలని విశ్వహిందూ పరిషత్ సంఘటన మంత్రి మల్లేశం అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో తిరుమలాపూర్ హనుమాన్ మందిరం నుంచి పేట పురవీధుల గుండా భజరంగ్ దళ్, వీహెచ్‌పీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. యువత దేశానికి ఆదర్శంగా ఉండాలని, దేశభక్తిని ప్రతీ ఒక్కరూ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు ఎర్ర శ్రీహరి, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్ దళ్, హిందూ సంఘాల బాధ్యులు సీతారామారావు, క్రాంతీలాల్, జంగం రాఘవులు, జైహింద్‌రెడ్డి, సతీష్ గౌడ్, కృష్ణమూర్తి, సర్వేశ్వర్, సంతోష్, రవివర్మ తదితరులున్నారు.

శౌర్య జాగరణ యాత్ర

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర జరిగింది. మండల భజరంగ్‌దళ్ అధ్యక్షుడు బద్దపురం సంగమేశ్వర్ ఆధ్వర్యంలో యువకులు, నృత్యాలు చేశారు.

ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయొద్దు

కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక

తూప్రాన్: బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించకపోతే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం బీఆర్‌ఎస్ నాయకులు మానుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రతీ కుటుంబానికి అందజేస్తామని గొప్పలు చెప్పిన బీఆర్‌ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో ఏ ఒక్క కుటుంబానికి మేలు చేసింది లేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పల్లెర్ల రవీంద్ర గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు గౌడ్, శశి భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'ప్రవళికది ప్రభుత్వ హత్యే'

పెద్దశంకరంపేట(మెదక్): గ్రూప్ – 2 పరీక్షలకు వాయిదా పడడంతో ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని, ఆమె కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, నిరుద్యోగులకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు నోటిఫికేషన్లు వేస్తూ మభ్యపెడుతుందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, నాయకులు శ్రావణ్, కృష్ణ, సంగమేశ్వర్ తదితరులున్నారు.

కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు శాపం



వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన నిరుద్యోగులకు శాపంగా మారిందని కాంగ్రెస్ వెల్దుర్తి మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్ మోసపూరిత మాటలతోనే విద్యార్థులు, నిరుద్యోగులు బలవంతంగా మరణాలకు పాల్పడుతున్నారని విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిరుద్యోగ యువతి ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించి బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

నేటి నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ గ్రామ సమీపంలో వెలసిన ఆలయంలో చాముండేశ్వరీ అమ్మవారు కొలువుతీరింది. తొమ్మిది అడుగుల ఎత్తు, పద్దెనిమిది చేతులతో జ్వాలా కిరీటం ధరించి ఉంటుంది.

ఉత్సవాలు వివరాలు

15 ఆదివారం నుంచి 23 వరకు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాపూజ, మహానివేదన, హారతి ఘనంగా జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో చాముండేశ్వరీ అమ్మవారు ఒకటే అవతారంలో ఉండి పూజలు అందుకోవడం ఇక్కడి ప్రత్యేకత.

ఆలయానికి చేరిక ఇలా..

హైదరాబాద్ నుంచి సంగారెడ్డి, జోగిపేట మీదుగా చాముండేశ్వరి దేవి ఆలయాన్ని చేరుకోవచ్చు. మెదక్ వైపు నుంచి జోగిపేట మార్గం, నర్సాపూర్ నుంచి జోగిపేటకు వెళ్లే మార్గం ద్వారా చాముండేశ్వరి ఆలయాన్ని చేరుకోవచ్చు.

తూప్రాన్: పట్టణంలో మహంకాళి దేవాలయం నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. వేడుకలకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం కలశస్థాపన, రుద్ర స్వాహాకార చండీ యాగం, పూర్ణాహుతి, గణపతి హోమం జరుగుతుంది. 16న మహాలింగార్చన, రుద్రాభిషేకం, 17న శాకంబరి అలంకరణ, 18న సామాజిక సమరసత, రాత్రి శ్రీ క్షేత్రం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం, లక్ష పుష్పార్చన, 25న వివిధ పూజలు, అభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపారు..



వెల్మకన్నలో విద్యాసరస్వతీ అమ్మవారు



గర్భగుడిలో కొలువైన చాముండేశ్వరీ అమ్మవారు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని విద్యాసరస్వతి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు మురళీశర్మ తెలిపారు. 15న అమ్మవారిని బాల త్రిపురసుందరిదేవి, 16న గాయత్రిదేవి, 17న అన్నపూర్ణదేవి, 18న లలితాదేవి, 19న మహాలక్ష్మీదేవిగా 20న మహాసరస్వతిదేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్దిని, 23న విజయ దశమి సందర్భంగా శ్రీరాజ రాజేశ్వరీదేవి అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లిలో వెలసిన దుర్గామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 15 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు శివ ప్రసాద్ తెలిపారు. దేవి శర్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఆలయం ముస్తాబుచేశారు.

భారత్ గెలుపు సంబరాలు

కొడిపల్లి(నర్సాపూర్): వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లో శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించింది. దీంతో మండల పరిధిలోని వెల్మకన్న గ్రామ యువత సంబరాలు చేసుకున్నారు. గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పటాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షుడు విజయ్‌కుమార్, మహేశ్, నాగరాజు, సురేశ్, రాహుల్, మహేశ్, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సాయి నామ సంకీర్తన

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో సోమవారం సాయి నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు పీఠం ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ శివకుమార్‌గౌడ్ శనివారం తెలిపారు. గూడూర్ గ్రామంలో శ్రీ గురు పీఠం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

'బీసీబంధు అందరికీ ఎందుకు ఇవ్వలేదు'

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీబంధు ప్రకటించి, అందరికి ఇవ్వకుండా కుటుంబాల్లో చిచ్చుపెట్టిందని బీజేపీ నాయకుడు, నిజాంపేట జెడ్పీటీసీ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీసీ బంధు అందకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డ కుమ్మరి శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, భరోసా కల్పించారు. బీసీబంధు వస్తుందనే ఆశతో ఉన్న శంకర్‌కు అందకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. బీసీబంధు అన్నదమ్ముల మధ్య చిచ్చుకు కారణమైందన్నారు. ప్రభుత్వం బీసీలందరికీ ఆర్థికసాయం చేయకపోవడంతో సమస్య వచ్చిందన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, దశరత్, ఆకుల రాజు, శ్రీనివాస్, మధు, మంజుల పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

మర్కూక్(గజ్వేల్): హక్కుల సాధనకు గౌడ సంఘం నాయకులు పోరాడాలని గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు పూదారి రాజు గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని మర్కూక్‌లో ఈత మొక్కలు నాటారు. ఆయా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రోహిత్ ఎమ్మెల్యేగా గెలుపొందాలి

రామాయంపేట(మెదక్): మెదక్ నియోజకవర్గం నుంచి మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు, ఎంఎస్‌ఎస్‌ఓ సంస్థ ప్రతినిధులు శనివారం మండలంలోని అక్కన్నపేట నుంచి చిన్నశంకరంపేట అమరవీరుల స్తూపం వరకు పాదయాత్ర నిర్వహించారు. రామాయంపేటకు చెందిన పార్టీ నాయకులు ఈ పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ నాయకులతో పాటు పార్టీ జిల్లా నాయకులు, ఎంఎస్‌ఎస్‌ఓ సభ్యులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో ప్రారంభమైన పాదయాత్ర

విధులకు రాని డాక్టర్

- సమయ పాలన పాటించని సిబ్బంది
- రోగులకు అందని వైద్యం



మధ్యాహ్నం రెండు గంటలకే మూతపడిన గడిపెద్దాపూర్ పీహెచ్‌సీ

అల్లాదుర్గం(మెదక్): డాక్టర్ విధులకు రావడం లేదు. ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రోగులకు వైద్యం అందడం లేదు. ఇదీ మండలంలోని గడిపెద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి. డాక్టర్ మూడు రోజులుగా విధులకు రావడం లేదని, ఆరోగ్య సిబ్బంది సహితం ఇష్టరాజ్యంగా విధులకు హాజరవుతున్నారని గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. శనివారం ఆరోగ్య కేంద్రానికి 10 గంటల ప్రాంతంలో వెళ్లితే డాక్టర్ రాలేదని, తిరిగి 2 గంటల ప్రాంతంలో వెళ్లితే ఆరోగ్య కేంద్రం మూసి ఉందన్నారు. ఆరోగ్య కేంద్రానికి మూడు రోజులుగా వెళ్తున్నా.. డాక్టర్ కనిపించడం లేదన్నారు. ఆరోగ్య కేంద్రానికి సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియడం లేదన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో వృద్ధులు కేంద్రానికి వచ్చి వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. అధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టరాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లా వైద్యాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న పీహెచ్‌సీ సూపర్‌వైజర్

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లి, దేవులపల్లి, పాంపల్లి, కూకుట్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురికి రోగనిరోధక టీకాలు వేశారు. గర్భిణులు ప్రతీ నెల వైద్యపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మహిళలు రక్తహీనతను నివారించుకునేందుకు ఆకుకూరలు, పాలు, కోడిగుడ్డు ఆహారంగా తినాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముట్రాజ్‌పల్లిలో వైద్యపరీక్షలను పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేశ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రిబ్‌క, మాధురి, మజీదబేగం, అంగన్‌వాడీ టీచర్లు నాగరాణి, రాణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.